కనిపించని పరిశుభ్రత

- రోడ్లపై పారుతున్న మురుగు
- పట్టించుకునే వారు కరువు
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ విలీన గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీటి కాలువల్లో మురుగు అగడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకునేవారు లేరని ఆవేదన చెందుతున్నారు. గ్రామపంచాయతీలుగా ఉన్నప్పుడే బాగుంది. మున్సిపల్‌లో విలీనం తర్వాత పారిశుధ్యంపై పట్టింపు కరువైందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని విలీన గ్రామాల్లోని వార్డులో మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

రోడ్లపై పారుతున్న మురుగు

తిప్పాపూర్‌లో మురుగు నీటి కాల్వలు ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో అవి కూలి మురుగు నీరు ఎక్కడికక్కడ అగి కంపుకొడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల ఎదుట మురుగు నీటితో కంపుకోడుతోంది. అలాగే వేములవాడ ఏరియా ఆసుపత్రి ఎదుట కాలనీలో మురుగు అగి రోడ్లపై పారుతోంది. పాదచారులు నడిచి వెళ్లేందుకు సైతం ఇబ్బంది పడుతున్నారు. అలాగే తిప్పాపూర్‌లోని వేములవాడ–సిరిసిల్ల రహదారి పక్కన నూతనంగా నిర్మించినన మురుగు నీటి కాలువల్లో నీరు అగి రోడ్డు పక్కన పారుతూ కంపుకోడుతోంది.

సీసీ రోడ్లపై దుమ్ము

తిప్పాపూర్ కాలనీకి వెళ్లె మేయిన్ రోడ్డు హనుమాన్ టెంపుల్ వరకు గతంలో నిర్మించిన సీసీ రోడ్డు గుంతలుపడి చెడిపోయింది. దానిపై మట్టి పోయడంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనలు వెళ్లడంతో దుమ్ము లేచి ఇళ్లలోకి వస్తోందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఆ మట్టిని తొలగించి నూతన సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులు లేవు

విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు లేవు. ఇప్పటికి కొన్ని కాలనీల్లో డ్రెయినేజీలు లేవు. కొన్ని కాలనీల్లో సీసీ రోడ్లు లేవు, మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. మిషన్ భగీరథ పైపుల వల్ల సీసీ రోడ్లు గుంతలుగా మారినా పట్టించుకున్న వారు లేరని కాలనీవాసులు అంటున్నారు. విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



డ్రెయినేజీ లేక ఆగిన మురుగు



ఇంటి పక్కన అగిన మురుగు

డ్రెయినేజీలు నిర్మించాలి



ఇంటి ముందు మురికి కాలువ లేక పోవడంతో మురికి నీరు అగి కంపుకోడుతుంది. రాత్రి పూట దోమలతో ఇబ్బందిగా మారింది. అధికారులు పట్టించుకుని మురికి కాలువ నిర్మాణం చేయాలి కొరుతున్నాము..

– దేవమ్మ తిప్పాపూర్

రోడ్డు చెడిపోయింది



తిప్పాపూర్ మెయిన్ రోడ్డు నుంచి హనుమాన్ దేవాలయం, ప్రభుత్వ పాఠశాల వరకు సీసీ రోడ్డు చెడిపోవడంతో రోడ్డుపై మట్టి వేశారు. దాంతో వాహనల తాకిడికి దుమ్ము లేస్తుంది. ఈ రోడ్డును నూతన సీసీ రోడ్డు వేయాలి.

– షఫీ, తిప్పాపూర్

కంపుకొడుతోంది



తిప్పాపూర్‌లో డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాకపోవడంతో మురుగు అగి కంపుకోడుతుంది. మురుగు నీరు రోడ్డుపై పారుతున్నా, శుభ్రం చేయడం లేదు. అధికారులు పట్టించుకోవాలి.

– శ్రీకాంత్, తిప్పాపూర్

క్లుప్తంగా

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



డీటీఆర్‌ను ప్రారంభిస్తున్న తిరుపతి

కోనరావుపేట: గ్రామాల్లో విద్యుత్ సంబంధ సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి అన్నారు. మండలంలోని వట్టిమల్ల 8వ వార్డులో ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ డీటీఆర్‌ను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్య ఏర్పడినా తన దృష్టికి తీసుకరావాలని కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము స్వప్న, ఉపసర్పంచ్ పుంగంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బోయినపల్లి: కేంద్ర ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచేలా పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా నాయకులు మంద సుదర్శన్, మీస లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం కొదురుపాక ఎక్స్‌రోడ్డులో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే గ్యాస్ సిలిండర్ల ధర పెంచడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సమితి కార్యదర్శి సావనపెల్లి మల్లేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సామ మల్లన్న, నాయకులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం



వట్టిమల్ల సర్పంచ్‌ను సన్మానిస్తున్న మహిళలు

కోనరావుపేట: మండలం వట్టిమల్లలో మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకలకు మహిళలు హాజరయ్యారు. సర్పంచ్ కొమ్ము స్వప్నను సన్మానించారు.

కల్యాణ వైభోగమే..



చందుర్తి: మండలంలోని బందపల్లి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల నుంచి వరకు శ్రీవారికి మేలుకొలుపు, 6 నుంచి 10 గంటల వరకు అభిషేకాలు, అగ్నిప్రతిష్ఠ, ధ్వజకుంభారాధన, పూర్ణాహుతి అనంతరం సంప్రదాయబద్ధంగా ఆలయ అర్చకులు కొదంగుల్లా శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. స్వామివారికి ఒడిబియ్యాన్ని మహిళ భక్తులు సమర్పించుకున్నారు. స్థానిక ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులతో పాటు కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ పట్టణ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు.



గంభీరావుపేట: మండలం భీముని మల్లారెడ్డిపేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన పెద్దమ్మ దేవాలయ పంచమ వార్షికోత్సవాన్ని మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. డప్పు చప్పుళ్ల మధ్య దాయాతి తమ్ముళ్ల ఆటలతో, శివశక్తుల పూనకాల మధ్య ఇంటికో బోనం తీసి అంగరంగ వైభవంగా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. లోక కల్యాణార్థం పెద్దమ్మ పెద్ది రాజుల కల్యాణం ముత్యాల పందిరిలో ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి ఓడి బియ్యం, కానుకలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు వీరబోయిన రమేశ్, లక్ష్మణ్, వెంకటస్వామి, పిట్ల శ్రీమతి, బాలవ్వ, రెడ్డబోయిన గోపి, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు

తాత్కాలిక టీచర్లు కావలెను

కోనరావుపేట: మండలం మరిమడ్లలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపాదికన పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక టీజీటీ (ఇంగ్లిష్)కు ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ చదివిన వారు, పీజీటీ (ఇంగ్లిష్)కు ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ అర్హత ఉన్నవారు, ఒక పీజీటీ (ఐటీ), జియాలజీలో సీనియర్ ఫ్యాకల్టీ, సబ్ అసోసియేట్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 9న ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్, జిరాక్స్ సెట్లతో మరిమడ్లలోని ఏకలవ్య పాఠశాలలో హాజరుకావాలని కోరారు.

నియామకం

బీజేపీ జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్‌గా సాయికిరణ్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన మాలోతు సాయికిరణ్‌ను బీజేపీ జిల్లా సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్‌గా నియామిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆదివారం నియామక పత్రాలు అందించారు.

మాదిగ సంక్షేమ సంఘం కార్యవర్గం

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి మాదిగ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి గుడిసె సదానందం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుడిసె మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గుడిసె తుమ్మల ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా గుడిసె పెద్ద మనోజ్‌కుమార్, గుడిసె క్రాంతికుమార్, గుడిసె పవన్‌కుమార్, క్యాషియర్‌గా గుడిసె దాసు, సంయుక్త కార్యదర్శులుగా గుడిసె నర్సయ్య, లింగాల మనోజ్ ఎన్నికయ్యారు.

అంబేడ్కర్ సంఘం

గంభీరావుపేట: మండల కేంద్రంలోని దోసల గూడెంలో అంబేడ్కర్ యువజన సంఘం (మాల) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోసల రాజనర్సు, ఉపాధ్యక్షుడిగా దోసల శంకర్, కార్యదర్శిగా దోసల ఉపేంద్ర, కోశాధికారిగా తోడేటి చంద్రయ్య, సలహాదారులుగా బరిగెల జీవన్, టేకుమల్ల భూమయ్య, బరిగెల సురేశ్ ఎన్నికయ్యారు.

'సిరిసిల్ల ప్రజలకు కాంగ్రెస్‌పై అభిమానం'



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై ఉన్న అభిమానం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాత్రతో నిరూపితమైందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఆద్యంతం రేవంత్‌రెడ్డి యాత్రకు ప్రజలు నీరాజనం పలికి పార్టీపై ఎనలేని అభిమానం చూపారన్నారు. యాత్ర సక్సెస్‌కు కారకులైన ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సబ్బండ వర్గాలు ఏకమై కాంగ్రెస్ చేపట్టిన యాత్రకు సంఘీభావం పలికారన్నారు. పార్టీ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర లక్ష్యాన్ని రేవంత్ రెడ్డి తన పాదయాత్ర ద్వారా ప్రజలకు తీసుకెళ్తున్నారన్నారు. సమావేశంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్యాణానికి తరలిరండి

రుద్రంగి: స్థానిక రామకిష్టాపూర్‌కాలనీలో గల శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం మంగళవారం నిర్వహించనున్నట్లు గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఎల్ల గంగాధర్ తెలిపారు.మహాలక్ష్మి కాలనీ గంగపుత్ర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, జాతర, మహాఅన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ గామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అందె సుభాష్‌ను ఆదివారం సాయంత్రం రాష్ట చేనేత జౌళి శాఖ చైర్మన్ ప్రవీణ్ పరామర్శించారు.

మండు వేసవిలో గోదావరి నీరు

- నిండుతున్న చెరువులు

ముస్తాబాద్: మండు వేసవిలో గోదావరి నీళ్లు మెట్ట ప్రాంతాన్ని తడుపుతున్నాయి. వానకాలంలో కూడా నిండని చెరువులు మల్లన్నసాగర్ జలాల పుణ్యమా అని నీటి గలగలలతో కళకళలాడుతున్నాయి. ముస్తాబాద్ మండలం మోహినికుంట, మద్దికుంట, చీకోడు, ముస్తాబాద్ గ్రామాలకు గోదావరి జలాలు వడివడిగా వస్తున్నాయి. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో మల్లన్నసాగర్ 12వ ప్యాకేజీ ద్వారా కెనాల్‌లో నిండుగా పారుతున్నాయి. చీకోడు, మద్దికుంట, మోహినికుంట, ముస్తాబాద్‌ల్లోని చెరువులు నిండుతున్నాయి. మద్దికుంట ఊర చెరువులోని బతుకమ్మ ఘాట్ గోదావరి నీళ్లతో పూర్తిగా నిండి మత్తడిపోస్తోంది. యాసంగి పంటలకు గోదావరి నీళ్లు రావడంతో బతికి బట్టకట్టామని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగు, తాగునీటికి ఇక ఢోకా లేదని ఎంపీపీ శరత్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు అన్నారు.



చీకోడులో గోదావరి జలాలు

విమర్శలు మాని.. శాశ్వత పనులు చేపట్టండి

ఎల్లారెడ్డిపేట: మండలంలో బీఆర్ఎస్ విమర్శలు మాని శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య హితవు పలికారు. ఆదివారం మండల కార్యాలయంలో మాట్లాడుతూ మల్కపేట ఫీడర్ ఛానల్ కాలువ ద్వారా వచ్చే నీటిని సింగసముద్రం నర్మాల ప్రాజెక్టుకు నీటిని తేవాలన్నారు. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని, కర్మాగారాలను స్థాపించి యువతకు ఉపాధిని కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, కార్యదర్శులు లింగం గౌడ్, గిరిధర్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా పట్టణాభివృద్ధి

సిరిసిల్లటౌన్: పక్కా ప్రణాళికతో మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంలో సిరిసిల్ల పట్టణం సమగ్రాభివృద్ధి జరుగుతుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక 19వ వార్డులో రూ.25 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణితో పాటుగా ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలో మౌలిక వసతులు కల్పనకై మంత్రి కేటీఆర్ రూ.15 కోట్లు అందించారని వాటితో అన్ని వార్డుల్లో వెచ్చిస్తున్నామన్నారు. ముఖ్యంగా విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు వెలడించారు. రగుడు జంక్షన్ నుంచి వెంకటాపూర్ క్రాస్ రోడ్డు వరకు రూ.7 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సిరిసిల్ల అభివృద్ధికి పాలకవర్గ కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గడ్డం చందనభగవాన్, అన్నారం శ్రీనివాస్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్

షాదీఖానా పరిశీలన

కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న షాదీఖానాను ఆదివారం తెలంగాణ రాష్ట్ర పవర్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పరిశీలించారు. ప్రారంభోత్సవానికి కావాలిసిన ఏర్పాట్లపై ఆరా తీశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

గుట్టలను కొల్లగొడుతున్నారు

- మట్టి అక్రమ తరలింపు
- వెనుదన్నుగా ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: మండలంలోని పలు ప్రాంతాల నుంచి అక్రమ మట్టి తరలింపునకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కొంతమంది వ్యాపారులు కొన్ని నెలలుగా ఈ దందా కొనసాగిస్తున్నా ఏ శాఖ వారు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని నూకలమర్రి, నమిలిగుండుపల్లి, చెక్కపల్లి, మర్రిపల్లి తదితర ప్రాంతాల నుంచి మట్టి అక్రమ తరలింపు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారం అంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారి వద్ద పెద్ద ఎత్తున ముడుపులు మాట్లాడుకుని వదిలిపెడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.



నమిలిగుండుపల్లి ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో తవ్విన మట్టి

ప్రభుత్వ స్థలాలపై పాగా

మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలపై సంబంధిత వ్యాపారులు పాగా వేసినట్లు తెలిసింది. అక్రమ మట్టి తరలింపులో ప్రైవేటు స్థలాలను కాకుండా ప్రభుత్వ స్థలాలపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇందులో ఫారెస్టుకు సంబంధించిన స్థలాల నుంచి ఈ అక్రమ మట్టి తరలిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది అధికార పార్టీ నాయకులు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమ మట్టి తరలింపుకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామాల ప్రజలు అంటున్నారు.

వర్గీకరణ పోరాటంలో కలిసి రావాలి

ఎల్లారెడ్డిపేట: ఏబీసీడీ వర్గీకరణలో మాదిగ, మాదిగ ఉపకులాలు కలిసి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణ లక్ష్యసాధనకు జరుగుతున్న పోరాటాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామ గ్రామానికి సందేశాన్ని తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఏప్రిల్ 3, 4న బీజేపీ రాష్ట్ర కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. అలాగే మార్చి 27, 28 తేదీల్లో ఛలో ఢిల్లీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. మార్చి 27 లోగా మండల స్థాయిలో కమిటీల ఏర్పాటును పూర్తి చేసుకుని 28న ఢిల్లీకి వెళ్లడానికి సిద్ధం కావాలన్నారు. వర్గీకరణ సాధించేందుకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట: మండలం బావుసాయిపేట మూలవాగు నుంచి ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. బావుసాయిపేట మూలవాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో దాడి చేయగా దొరికిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ పిట్టల గంగాధర్, యజమాని చొక్కాల దేవరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. రెండోసారి పట్టుబడితే బైండోవర్, మూడోసారి ట్రాక్టర్ జప్తు చేయబడుతుందన్నారు.

రుణమాఫీ రూ.లక్ష చేయాలి

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ రూ.లక్ష వరకు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మ్యాకల మల్లేశం ఒక ప్రకటనలో అన్నారు. 2018 ఎన్నికల్లో రైతు రుణమాఫీ లక్ష వరకు చేస్తామని చెప్పి ఇప్పుడు రూ.90 వేల వరకు చేస్తామని మాట్లాడటం ఏంటన్నారు.